# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల

## సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**ఇంగ్లీషు — THE VOICE OF TRUTH**

సోమవారము 9-00 to 9-15 p. m.
బుధవారము 9-30 to 9-45 a. m.

**హిందీ — SATYA SUSAMACHAR**

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 p. m.
ఆదివారము — 1-30 to 1-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము, శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మళయాళం — THE VOICE OF TRUTH**

మంగళవారము, శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరి ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి:

**SATYA VANI**
P.O. Box. 80
KAKINADA - 533 001

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ - 533 001

ఎడిటర్ :
జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ :
జాషువా గూటం

సంచిక 5 | డిశంబరు 1984 | సంపుటి 5

# సంపాదకీయము

## క్రీస్తును గూర్చి మీ కేమి తోచుచున్నది?

*( What think ye of Christ ? )*

లేఖనాల్లో రికార్డు చేయబడిన సందర్భము ఒకటి ఈలాగున యున్నది: "ఒకప్పుడు పరిసయ్యులు కూడి యుండగా యేసు వారిని చూచి-క్రీస్తును గూర్చి మీ కేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు ఆయన దావీదు కుమారుడని చెప్పిరి. అందుకాయన - ఆలాగైతే, నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద ఉంచువరకు నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అని దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని వారి నడుగగా ఎవడును మారుమాట చెప్పలేకపోయెను. మరియు ఆ దినము నుండి ఎవడును ఆయనను ఒక ప్రశ్నయు అడుగ తెగింపలేదు" (మత్తయి 22:41-46).

పరిసయ్యులు యేసుకాలంలో యూదులలో ఒక తెగవారు. వారు దేవదూతలను, పునరుత్థానమును నమ్మేవారైనను, యేసు దేవుని

కుమారుడని మాత్రం నిరాకరించారు. ఆయనను ఏలాగైనను ప దోషియాలనే ఉద్దేశంతో అనేకసార్లు ప్రశ్నలు వేసేవారు. ఈప్రశ్న సందర్భంలో, క్రీస్తుని గూర్చి వారేమనుకొనుచున్నారో యేసు తె నుకో గోరాడు. ఆయన దావీదు కుమారుడని వారనుకొనుచున్న జవాబిచ్చారు. వారు చెప్పినట్లుగా యిది సత్యమేగాని, ఆయనే మెస్సీ అని అది పూర్తిగా గుర్తించలేదు. ఆయన దావీదు కుమారునికం ఎక్కువేమీ కాకపోతే దావీదు ఆయనను తన ప్రభువని ఎట్లు సంబో ధించాడని యేసు వారినడిగాడు. ఒక తండ్రి సాధారణంగా త కుమారుని ప్రభువని సంబోధించడని, తనకంటే గొప్పవానినే అ సంబోధిస్తాడని వారు గ్రహించారు. ఈ మాటలు వినగానే వారెవ మారు మాటలాడలేక పోయారు. యేసును ఇక ప్రశ్నలు వే తెగింపలేదు.

యేసు యొక్క నిజస్వరూపమును, పాత నిబంధన లేఖనము క్రీస్తును, గుర్తించుటలో పరిసయ్యులు ఏలాగు అపార్థము చేసికొన్నారో, ఆలాగే ఆనాటి కాలంలో యితరులుకూడ ఆయనను అపార్థం చే కొన్నారు. యోహానును శిరచ్ఛేదనం చేసిన హేరోదు రా యోహానే మృతులలో నుండి లేచి క్రీస్తువలె వచ్చాడనుకొన్నా (మత్త 14:1, 2). కొందరు ఆయన ఏలియా యనియు, యిర్మీయా యనియు లేక ప్రవక్తలలో ఒకడనియు అనుకొన్నారు (మత్తయి 16:13, 14). మరికొందరు ఆయన దయ్యముల అధిపతికి చెందినవాడని అనుకొన్నారు (మార్కు 3 : 22). అనేకులయితే ఆయన నజరేతు వడ్రంగివాడైన యోసేపు కుమారుడని తలంచారు. మరికొందరేమో ఆయన మోసగాడు, అబద్ధప్రవక్త, దేవదూషకుడు అని అనుకొన్నారు.

యేసు దేవుని కుమారుడని కొద్దిమంది మాత్రమే నమ్మారు. యేసు తన కుమారుడని దేవుడు పరలోకం నుండి పలికాడు కూడా (మత్త 17:5). అపొస్తలులందరి తరపున మాట్లాడుతు పేతురు, యేసు

సజీవుడైన దేవుని కుమారుడగు క్రీస్తు అని ఒప్పుకొన్నాడు (మత్త 16:16, 17). బాప్తిస్మ మిచ్చు యోహాను తాను క్రీస్తుకు బాప్తిస్మ మిచ్చుటకంటే, తానే క్రీస్తుచే బాప్తిస్మము పొందవలసి యున్నదని చెప్పాడు (మత్త 3:13, 14). అపవాది యేసును గూర్చి ఎరిగినవాడై ముమ్మారు ఆయనను శోధించాడు. ప్రతిసారి ప్రభువతనిపై జయించాడు. అపవాది ఆయన నుండి పారిపోయాడు (మత్తయి 4). ఐతియోపీయ మనుష్యునికి ఫిలిప్పు బోధించిన తరువాత, అతడు బాప్తిస్మము పొందగోరాడు. అతడు తన హృదయ పూర్వకంగా విశ్వసిస్తే బాప్తిస్మము పొందవచ్చునని ఫిలిప్పు చెప్పాడు. "అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తర మిచ్చాడు" (అపో. కా. 8:37). అప్పుడు ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మియ్యగా సంతోషించుచు అతడు తన త్రోవను వెళ్లాడు.

కొందరనుకొన్న దానికి భిన్నంగా, నిజానికి క్రీస్తు దేవుని కుమారుడని లేఖనములు చిత్రీకరించుచున్నవి. ఆయన వాగ్దానము చేయబడెను (ఆది 3:15), ప్రవచింపబడెను (యెషయా 7:14), కన్యకు జన్మించెను (మత్త 1), అనేక అద్భుతాలుచేసి తన శక్తి నిరూపించెను, మరియు ఆయన సిలువపై చనిపోయి పాతిపెట్టబడినను, ఆయన వాగ్దానముచేసిన రీతిగా మూడవ దినాన్న తిరిగి లేచెను. ఈనాడు ఆయన దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడై రాజులకు రాజుగా, ప్రభువులకు ప్రభువుగా పాలించుచున్నాడు. కాని అంతేకాదు. మన జీవితములు నిర్మించుకొనుటకుగాను ఆయన బండయని, స్థిరమైన పునాదియని, ముఖ్యమైన మూల రాయి యని (మత్త 7:24, 25; 1 కొరింథీ 3:11; పేతురు 2:2), వాక్యమని (యోహాను 1:1), మార్గము, సత్యము, జీవమని (యోహాను 14:6), జీవాహారమని (యోహాను 6:35), జీవ జలమని (యోహాను 4:14), ఈ లోకానికి వెలుగని (యోహా 8:12), సంఘశిరస్సని (ఎఫెసీ 1:22, 23; కొలస్స 1:1 ), షారోను పుష్పము, లోయలలో పుట్టు పద్మమని (పరమగీతము 2:1), మన ప్రధాన యాజ

కుడు, పస్కాపశువని (హెబ్రీ 9:12; 1 కొరింథీ 5:7), రక్షకుడని చెప్ప బడెను (1 తిమో 4:10; 1 యోహాను 4:14).

అయితే నీసంగతి యేమిటి? క్రీస్తుని గూర్చి నీ వేమనుకొను చున్నావు? మానవులందరివలె జీవించి చనిపోయిన ఒక మానవుడని నీ వనుకొనుచున్నావా? బహుశ ఆయన ఒక కట్టుకథయని, కల్పిత పురుషుడని అనుకొనుచున్నావేమో, బహుశ ఆయన నైతికంగా మంచి వాడని లేదా ఒక ప్రవక్తయని అనుకొనుచున్నావేమో. లేదా ఆయన దేవుని నుండి వచ్చినవాడని, మానవుల రక్షణార్థమై మానవులమధ్య జీవించి సిలువపై చనిపోయాడని నీవు నమ్ముచున్నావేమో. అట్లయితే ఆయన పునరుత్థానుడైన ప్రభువని, దేవుని కుమారుడని, ఇప్పటికీ ఎప్ప టికీ సజీవుడై యున్నవాడని నీవు ఒప్పుకొంటావు. ఆయన సంఘాన్ని నిర్మించినవాడని, పాపములు క్షమించువాడని, మానవుని ఏకైక నిరీక్షణ యని, మరల వచ్చి నీతిమంతులను పరలోకానికి తీసికొని వెళ్లువాడని కూడా నీవు ఆయనను అంగీకరిస్తావు.

క్రీస్తుని గూర్చి నీవేమనుకొనుచున్నావో దాన్నిబట్టి ఆయనను నీవేమి చేస్తావో ఆధారపడి యుంటాది. ఆయనను నీవెరుగకపోతే అంగీకరించలేవు. పలుచోట్ల నుండి ఆయనను గూర్చి నీవు కొంచెము మాత్రమే వినియుంటే నీవాయనను నిర్లక్ష్యం చేస్తావు. ఆయన శత్రు వులద్వారా వినియుంటే బహుశా ఆయనను ద్వేషిస్తావు. అయితే ఆయనను గూర్చిన సత్యంకొరకు, ఆయన రాకడ వాస్తవములు, జీవిత విశేషాలు, ఈలోకంపై ఆయన జీవిత ప్రభావం, ఆయన మరణ సమాధి పునరుత్థానముల ఫలితాలు, పరలోకమందున్న తండ్రి యొద్దకు ఆయన ఆరోహణుడగుట మొదలగు వాటికొరకు నీవు బైబిలుయొద్దకు వెళ్ళితే, నీవు తప్పకుండా ఆయన దేవుని కుమారుడని కోట్లకొలది ప్రజలవలె విశ్వసిస్తావు. ఆయనను నీ ప్రభువుగాను, రక్షకునిగాను అంగీకరిస్తావు.

నిజంగా క్రీస్తు ఈనాడు జీవించుచున్నాడు. ఆయన పరలోకమందు జీవించుచున్నాడుగాని ఆయన తన వాక్యముద్వారా సంఘములో, ప్రతి క్రైస్తవునితో భూమిమీదకూడ జీవించుచున్నాడు. ఆయనయందు విశ్వాసముంచి ఆయన బోధకు లోబడువారిని ఆయన రక్షిస్తాడు. పాపులను క్షమిస్తాడు. తన ప్రజలతో ఉంటానని, వారి కొరకు మరల వస్తానని ఆయన వాగ్దానం చేసాడు. అందువలన ఆయన మనకు జీవం, నిరీక్షణ.

క్రీస్తు మూలముగా ఈలోకం నిలిచియున్నది. ఆయన లేకుండా ఈలోకం నిలబడలేదు. ఆయన రాకడవలన ఈలోకం మార్చబడింది. తెలిసినను తెలియకపోయినను మానవులందరు ఆయనవలన ప్రభావితులగుచున్నారు.

మరల, క్రీస్తును గూర్చి నీవేమను కొనుచున్నావు? నీవాయనయందు విశ్వాస ముంచుచున్నావనే నా నిరీక్షణ. అయితే విశ్వాసిగా నీవాయనకు విధేయత చూపించలేదేమో. అట్లయితే నీవాయనకు చెందవు. నీవాయనయందు విశ్వాసివి కాకపోతే దయచేసి ఆయనను గూర్చి బైబిలులో చదువుము. ఆయనను పరిచయం చేసికో. ఆయన జీవితం, పని, అద్భుతాలు, మానవు లందరికొరకు ఆయన చేసిన బలి, ఆయన పునరుత్థానమును గూర్చిన వాస్తవాలను పరిశీలించు. నీవట్లు చేస్తే తప్పక నీ వాయనయందు విశ్వాస ముంచగలవు. అప్పుడు విశ్వాసిగా రక్షింపబడు నిమిత్తం ఆయనకు లోబడుము. నీవాయన కొరకు జీవిస్తూ నిత్యజీవ నిరీక్షణను కలిగి యుండుము. క్రీస్తునందు విశ్వాస ముంచకపోతే నీవు నశించిపోతావు. పాపములోనే యుండుట వలన ఈ లోకంలోను, రాబోవు లోకంలోను నీకేమీ నిరీక్షణ యుండదు.

క్రీస్తునందు విశ్వాసిగా, ఆయనకు లోబడువానిగా నీవు పోగొట్టుకొనేది ఏమీ లేదుగాని సమస్తాన్ని పొందగలవు.

బైబిలు గ్రంథం దేవుని వాక్యం-4

# ప్రవచనముల నెరవేర్పు

## *( Fulfillment of Prophecies )*

దేనినయినా తింటేనేగాని దానిరుచి తెలియదు. బైబిలు ప్రవచనాలను గూర్చికూడా అట్లే చెప్పవచ్చు. ఏదైనా ప్రవచనము నెరవేరినమీదనే అది దేవునివలన కలిగిందని చెప్పవచ్చు. మోషే ఇట్లు వ్రాసాడు: "అంతేకాదు ఏ ప్రవక్తయు అహంకారముపూని, నేను చెప్పమని తన కాజ్ఞాపించని మాటను నా నామమున చెప్పునో, యితర దేవతల నామమున చెప్పునో, ఆ ప్రవక్తయు చావవలెను. మరియు. ఏదొకమాట యెహోవా చెప్పినది కాదని మేమెట్లు తెలిసికొనగలమని మీరనుకొనిన యెడల, ప్రవక్త యెహోవా నామమున చెప్పునప్పుడు ఆమాట జరుగకపోయిన యెడలను, ఎన్నడును నెరవేరకపోయిన యెడలను, అది యెహోవా చెప్పిన మాటకాదు. ఆ ప్రవక్త అహంకారముచేతనే దానిని చెప్పెను గనుక దానికి భయపడవద్దు" (ద్వితీ 18:20-22).

పై మాటలలో 'ప్రవక్త పరీక్షను' మోషే మన కిచ్చాడు. ఒక ప్రవక్త జరుగబోవు సంఘటన నొకదానిని ప్రవచించిన యెడల, అది అట్లు జరుగకపోతే అతడు అబద్ధ ప్రవక్తయని దేవుని మాటలను మాటలాడలేదని నిరూపణ యగును. అట్లుగాక ప్రవక్త జరుగబోవు సంఘటనను గూర్చి చెప్పినప్పుడు అతడు చెప్పినట్లే అది జరిగినప్పుడు, ఆవర్తమానము అతని కెక్కడ నుండి వచ్చిందో చెప్పే అధికారము అతనికుంటాది.

బైబిలులో ఒకే ఒక్క ప్రవచనముగాక, నాశనము చేయబడబోవు పట్టణములను గూర్చి, రాజ్యములను గూర్చి, దేశములనుగూర్చి అనేక ప్రవచనముల గొలుసు గలదు. ఇవి కొన్ని వందల లేక వేల సంవత్సరములకు ముందే ప్రవచింపబడినను, అవి అక్షరాల నెరవేర

వనుటలో సందేహములేదు. జరుగబోవు సంగతులను గూర్చి చెప్పిన బైబిలు లేఖకులు వారు పరిశుద్ధాత్మచే నడిపింపబడిన వారమని చెప్పు కొందురు. బైబిలునందు నెరవేరిన అనేక ప్రవచనములలో కొన్నిటిని ఈ క్రింద పొందుపరచుచు, దైవావేశము లేనియెడల అట్టి ప్రవచనము లను మానవు లెట్లు చెప్పియుండగలరో ఆలోచించ వలసినదిగా కోరు చున్నాము.

## బబులోను గూర్చిన ప్రవచనము

క్రీస్తుకు పూర్వము ఇంచుమించు 750 సంవత్సరముల క్రితము ప్రవక్తయైన యెషయా జీవించాడు. ఆ దినములలో బబులోను గొప్ప వైభవోపేతమైన పట్టణము. యూఫ్రెటీసునది కిరుప్రక్కల అనేక చదురపుమైళ్ళు వ్యాపించిన గొప్ప పట్టణము. ఎంత శక్తివంత మైన సైన్యముకైనను భయంకరముగా కన్పించునట్టి గంభీర ప్రహ రీలతో అది నిర్మించబడింది. అట్టి సందర్భములో అది నాశనమై పోతాదని చెప్పడం అసాధ్యం. కాని ప్రవక్తయైన యెషయా ఇట్లు ప్రవచించాడు: "అప్పుడు రాజ్యములకు భూషణమును కల్దీయులకు అతిశయాస్పదమును మహాత్మ్యమునగు బబులోను దేవుడు పాడుచేసిన సొదొమ గొమొర్రాలవలెనగును. అది మరెన్నడును నివాసస్థలముగా నుండదు. తరతరములకు దానిలో ఎవడును కాపురముండడు. అరబీ యులలో ఒకడైనను అక్కడ తన గుడారము వేయడు. గొర్రెల కాపరులు తమ మందలను అక్కడ పరుండనియ్యరు. నక్కలు అక్కడ పండుకొనును. గుడ్లగూబలువారి యిండ్లలో ఉండును. నిప్పుకోళ్ళు అక్కడ నివసించును. కొండమేకలు అక్కడ గంతులు వేయును. వారి నగరులలో నక్కలును, వారి సుఖవిలాస మందిరములలో అడవి కుక్క లును మొరలిడును. ఆ దేశమునకు కాలము సమీపించి యున్నది. దాని దినములు సంకుచితములు" (యెష 13:19-22).

యెషయా బబులోను నాశనం, దానివలన కలుగు జీవనస్థితిని గూర్చియేగాక, ఆపనిని జరిగించు రాజు పేరును, విధానాన్ని కూడా ప్రవచించాడు. అతడు చెప్పినదాన్ని గమనించుము : "అతని పక్షమున జనములను జయించుటకు నేను అతని కుడిచేతిని పట్టుకొని యున్నాను. నేను రాజుల నడికట్లను విప్పెదను. ద్వారములు అతని యెదుట వేయ బడకుండ తలుపులు తీసెదను అని యెహోవా తాను అభిషేకించిన కోరెషును గూర్చి సెలవిచ్చుచున్నాడు" (యెషయా 45:1). "నేను నీ నదులను ఎండ చేయుచున్నాను. ఎండి పొమ్మని ప్రవాహముతో నేనే చెప్పుచున్నాను" అనిగూడ ఆయన కోరెషుకు సెలవిచ్చుచున్నాడు (యెష 44:27). యెషయాతో కలసి యిర్మియా ఇట్లు ప్రవచించాడు: "బబులోను నిర్జనమై కనువుదిబ్బలుగా ఉండును. నక్కలకు నివాసస్థ మగును. అది పాడై యెగతాళికి కారణముగా ఉండును" (యిర్మి 51:37).

ఒక శతాబ్దము గడచుసరికి కల్దీయులకు అతిశయాస్పదమును మహాత్మ్యమునేగాక, బబులోను దేదీప్యమానముగా అభివృద్ధి జెందెను. ఫలదాయకమగు నెబుకద్నెజరు ఏలుబడి కాలమునందు ఈ మహత్తర అభివృద్ధి కలిగెను. ఆ గర్వమువలననే అతడు "బబులోను ఈ మహా విశాల పట్టణము నా బలాధికారమును, నా ప్రభావ ఘనతను కన బరచుటకై నా రాజధాని నగరముగా నేను కట్టించినది కాదా యని తనలో తాననుకొనెను" (దానియేలు 4:30). దీనినిబట్టి బబులోనును గూర్చి చెప్పబడిన ప్రవచనములు నిరర్థకములే యగు ననిపించును. అయితే ఈ ప్రవచనములను ఒకదానివెంట మరొక దానిని పరిశీలిం చుచు చరిత్రలో అవి నెరవేరిన విధానమును పరీక్షింతము.

కోరెషు అను రాజుచే బబులోను వశము చేసికొన బడబోవు నని ప్రవచింపబడెను. బెల్షాజరు ఏలుబడిలో పర్షియాదేశపు రాజు కోరెషు మాదీయుల సహాయముతో బబులోనును వశము చేసికొనెను.

'నీ నదులను ఎండింప జేతునని' యెషయా ప్రవచించాడు. బబులోను గోడల క్రింద నుండి యూఫ్రటీసునది ప్రవహించు చుండెను. దండయాత్ర జరుపు మాదీయ, పారశీక దేశముల సైన్యములు ఆపట్టణముకు వచ్చుసరికి దాని గంభీర ప్రాకారమువలన లోనికి పో వీలులేనందున ఆ నదీజలములను మరియొక కృత్రిమ తటాకములోనికి మళ్ళింప జేయుటద్వారా వారు యూఫ్రటీసు నదిని ఎండింపజేసారు. అప్పుడా సైన్యములు ఆరిన ఆ నదిగుండాపోయి సంశయించని బబులోను నగరవాసులపై బడ్డారు.

తిని త్రాగుచు, విందారగించు సమయాన బబులోను వశపరచుకొనబడుననికూడ ప్రవచింపబడింది. "వారు సంతోషించి మేలుకొనక చిరకాల నిద్ర నొందునట్లు వారు దప్పిగొనగా వారికి మద్యము నిచ్చి వారిని మత్తిల్ల జేసెదను, ఇదే యెహోవా వాక్కు" (యిర్మి 57:39). ఒకానొక రాత్రి రాజైన బెల్షాజరు వేయి ప్రభువులకును, ఘనులకును గొప్ప విందు గావించెనని, ఆ విందులో మద్య మెక్కువగా ఉపయోగింప బడెనని అతి విశదముగా చరిత్ర మనకు చెప్పుచున్నది. వారు మత్తిల్లి విందారగించు ఈ సమయముననే మాదీయ, పారశీక దేశముల సైన్యములు బబులోను పట్టణంలో ప్రవేశించాయి.

బబులోను నివాసయోగ్యముగాక, నిర్జనమై యుండునని ప్రవక్తలు చెప్పారు. బబులోనును వశము చేసికొనిన తరువాత మాదీయుడైన దర్యావేషు ఆ పురపాలకునిగా నుండెను. అతని ఏలుబడిలో ఆ పట్టణమును వశము చేసుకొనుసరికి అది నిర్జనముగా నుండుట కారంభమయ్యింది. అతడాపట్టణాన్ని పునర్నిర్మించుటకు, పూర్వ వైభవాన్ని పునరుద్ధరించుటకు పూనుకొన్నాడు. కాని అతని అకాల మరణము వలన ఆ కార్యక్రమములన్నీ భంగపరచబడ్డాయి. ఆనాటినుండి ప్రవక్తలు ప్రవచించిన విధంగా బబులోను నిర్జనాత్మక స్థితికి బహువేగంగా చేరింది. పర్షియా ప్రజలు నాశనము చేయగా వదిలిన దానిని కాలము

సంపూర్తి చేసింది. క్రీస్తు తరువాత అయిదవ శతాబ్దము నాటికి నివాసయోగ్యముకాని నిర్జనపురముగా అది తయారయ్యింది.

బబులోను నాశనమును గూర్చిన ప్రవచనము లన్నిటిని, వాటి నెరవేర్పును ఇక్కడ వివరించుట సాధ్యపడదు. అయితే మరియొక సంగతి మాత్రము దానిని గూర్చి చూద్దాం. అరబీయులలో ఒక్కడైనను తన గుడారమును వేయడనియు, గొర్రెల కాపరులు తమ మందలను అక్కడ పరుండ నీయరనియు యెషయా ప్రవచించాడు. ఆ ప్రదేశమును చూచి వచ్చిన యాత్రికుల సాక్ష్యములే ఈ ప్రవచన నెరవేర్పును చెప్పుచున్నవి. అక్కడ క్రూర మృగము లుండుటచేత, మంచి పచ్చిక ఆ ప్రదేశమందు లేకపోవుటచేత గొర్రెల కాపరులు తమ మందల నక్కడ పరుండనీయరనియు, దురాత్ములు లేక దయ్యముల నివాసస్థానమని అరబీయులు దానిని గూర్చి భయపడుటచే వారిలో ఎవడును అక్కడ తన గుడారమును వేసికొనడనియు పై యాత్రికులు చెప్పుదురు.

ఆయా సంగతులు జరుగక ఇంచుమించు రెండువందల సంవత్సరములకు ముందే ఈ ప్రవచనములు చెప్పబడుటను గూర్చి తలంచునపుడు మానవ భవిష్య దృష్టికంటె గొప్పదేదో దీనికి కారణమైయున్నట్లు పక్షపాతములేని ప్రతివానికి గోచరమగును. ప్రతి వచనము తూ.చ.లు తప్పక నెరవేరుటచే అది దైవావేశముచే మాత్రమే పలుకబడినదని గణించనగును.

## నీనెవె నాశనము

నీనవె అష్షూరుదేశపు ముఖ్యపట్టణము. అది మూడు దినములు ప్రయాణించ తగునంత గొప్ప పట్టణమని బైబిలు చెప్పుచున్నది. డయొరస్ సిక్యులస్ అను పురాణ చారిత్రకుడు దాని విస్తీర్ణము: 60 మైళ్ళవరకు వ్యాపించి యుండెనని చెప్పాడు. దాని ప్రాకారములు వంద అడుగుల ఎత్తును, మూడురథములు ఒకేసారి పోగల్గునంతటి వెడల్పును

కలవనియు, వరుస స్థానములలో ఆ ప్రాకారములయందు రెండు వందల అడుగుల ఎత్తుగల గోపురములు కలవనియు అతడు వ్రాసాడు.

యూదా రాజగు యోతాము కాలమందు ప్రవక్తయైన నహూము నివసించాడు. గనుక నీనెవె నాశనమునకు వంద సంవత్సరములముందే అతని ప్రవచనములు వ్రాయబడ్డాయి. నాడు నీనెవె మహోన్నతస్థాన మందుండుటచే అది నాశనము చేయబడునని చెప్పుట కాధార మేమియు లేదు. అయితే ప్రవక్తయైన నహూము అది నాశనము చేయ బడునని చెప్పుటయేగాక, అదెట్లు జరుగునోకూడ చెప్పాడు: "ప్రళయ జలములవలె ఆయన ఆ పురస్థానమును నిర్మూలము చేయును. తన శత్రువులు అంధకారములో దిగువరకు ఆయన వారిని తరుమును. యెహోవాను గూర్చి మీ దురాలోచన యేమి? బాధ రెండవమారు రాకుండ ఆయన బొత్తిగా దానిని నివారణ చేయును. ముండ్లకంప వలె శత్రువులు కూడినను, వారు ద్రాక్షారసము త్రాగి మత్తులైనను ఎండిపోయిన చెత్తవలె కాలిపోవుదురు" (నహూము 1:8-10). "నదుల దగ్గర నున్న గుమ్మములు తెరువబడు చున్నవి. నగరు పడిపోవు చున్నది" (నహూ 2:6). అచ్చటనే అగ్ని నిన్ను కాల్చి వేయును. ఖడ్గము నిన్ను నాశనము చేయును. గొంగళిపురుగు తినివేయు రీతిగా అది నిన్ను తినివేయును. నీవు సంఖ్యకు గొంగళి పురుగులంత విస్తార ముగాను, మిడుతలంత విస్తారముగాను ఉండుము" (నహూము 3:15).

జెఫన్యాకూడ ఈలాగున ప్రవచించాడు: "ఆయన ఉత్తర దేశముమీద తన హస్తము చాపి అష్షూరు దేశమును నాశనము చేయును; నీనెవె పట్టణమును పాడుచేసి దానిని ఆరిపోయిన ఎడారివలె చేయును" (జెఫన్యా 2:13-15 చదవండి).

నేడు చరిత్ర పుటలను పరిశీలిస్తే ఆ ప్రవచనములు అంశముల వారిగ నెరవేరినట్లు చూడగలము.

నీనెవెవారు త్రాగుబోతులై యుండగా ఆపట్టణము వశము

చేసికొన బడునని ప్రవచింపబడెను. మాదీయ, బబులోను సైన్యములు నీనెవె మీదికి దండయాత్రకు వచ్చినప్పుడు అష్షూరు దేశపు రాజు వారిని వరుసగా మూడు యుద్ధములలో ఓడించెనని డయొరస్ సిక్యులస్ అను చరిత్రకారుడు చెప్పుచున్నాడు. వారు పొందిన ఈ గెలుపులలో నీనెవెవారు అధికంగా ఉప్పొంగుచు, విందారగించుచు, త్రాగుచు, ఉల్లాసముగా నుండిరి. అయితే దండెత్తే శత్రుసైన్యములు వారి విలాస కార్యములను గూర్చి తెలిసికొని, తెలియని రీతిగా వారిపై బడి అతి నిశ్చయమైన జయమును పొందారు.

నీనెవె అగ్నితోను, నీటితోను ఏకముగా నాశనము చేయబడునని ప్రవచింపబడెను. అది అక్షరాల నెరవేరెను. నీనెవెకు నదులు శత్రువు లైతేనేగాని దానినెవరు వశము చేసికొనలేరని ఆ పుర ప్రజల విశ్వాసమని డయొరస్ చెప్పాడు. పై వారి దండయాత్రలో మూడవ సంవత్సరమున ఎడతెగని వర్షములచే ఆనదిపొంగి పట్టణ ప్రాకారములను కొంతమట్టుకు కూలగొట్టెను. రాజు దానిని చూచి వారనుకున్నట్లే నదులు వారికి శత్రువులుగా తయారైనందున తన శక్తిని కోల్పోయి, శత్రువు చేతిలో పడకుండునట్లు తన రాజభవనాన్ని, ఆస్తులను కాల్చివేసి అగ్నిలో చనిపోయాడు. శత్రువులు రాజు మరణవార్త వినగానే వర్షపాతమువలన గోడలలో కల్గిన పగుళ్ళగుండా పట్టణములో ప్రవేశించి వశము చేసికొన్నారు.

"బాధ రెండవమారు రాకుండ అది బొత్తిగా నిర్జనమై అడవి మాదిరిగ యుండునని", సంపూర్తిగ నీనెవె నాశనము చేయబడునని ప్రవచింపబడెను. నీనెవె పలుమారులు పునర్నిర్మించబడినను, మాదీయులు, బబులోనీయుల చేత నాశనము చేయబడిన తరువాత అది ఎన్నడు తిరిగి నిర్మించబడలేదు. అట్టి వైభవోపేతమైన పట్టణము ఎక్కడ ఉండెనో తెలిసికొన వీలులేనంతగా ఆ ప్రదేశము పాడై పోయెను.

పురాతన గ్రంధకర్తలు ఈగొప్పపట్టణముల నాశన విధానమును, ఫలితములను కొన్ని సంవత్సరములకు ముందే ఏలాగు చెప్ప గలిగారు? కేవలం ఊహించి మాత్రమే వారట్లు చెప్పారా! లేక పరిశుద్ధాత్మ ప్రేరేపణవలన వారు ఆయా సంగతులను చెప్పారా? దేవుని ఆత్మ ప్రేరేపణవలన వారు పలికారని వారే చెప్పుచున్నారు. వారిమాట నమ్ముట మంచిది. (సశేషము) —మోరిస్ బెయిలీ

---

విశ్వాస వీరులు-7

## యోసేపు

## *( Joseph )*

"యోసేపు తనకు అవసానకాలము సమీపించినప్పుడు విశ్వాసమునుబట్టి ఇశ్రాయేలు కుమారుల నిర్గమనమును గూర్చి ప్రశంసించి తన శల్యములను గూర్చి వారికి ఆజ్ఞాపించెను" (హెబ్రీ 11:22).

యోసేపు బానిసగా అమ్మివేయబడిన నాటినుండి, ఐగుప్తులో తన సోదరులకు తన్నుతాను తెలియపరచుకొన్న సమయంవరకు ఉన్న సందర్భాలను గూర్చి ఎక్కువ పాఠములు మనం వింటూ యుంటాము. అతడు యౌవనుడుగా యున్న ఈ కాలంలో మనం నేర్చుకోదగ్గ పాఠములు నిజంగా ఎన్నో ఉన్నాయి. అయితే యోసేపు యొక్క తరువాత కాలం గూర్చి మనం వినడం అరుదు. అందువలన అతని అవసాన కాలమందలి దృశ్యాలను యోసేపు విశ్వాసానికి సాక్ష్యంగా హెబ్రీ గ్రంథకర్త లేఖకుడు చూపించడం కొంత ఆశ్చర్యంగానే యున్నది.

ఈ దృశ్యాలను మనం వెనకకు ఒకసారి చూచి, వాటిలో మనకు ఏమేమి పాఠములున్నవో తెలిసికొందాం. "యోసేపు తన సహోదరులను చూచి-నేను చనిపోవు చున్నాను; దేవుడు నిశ్చయముగా మిమ్మును చూడవచ్చి ఈ దేశములో నుండి తాను అబ్రాహాము ఇస్సాకు యాకోబులతో ప్రమాణముచేసి యిచ్చిన దేశమునకు మిమ్మును తీసికొనిపోవునని చెప్పెను" (ఆది 50:24).

దేవుడు తన ముత్తాతకు, తాతకు, తండ్రికి చేసిన గొప్ప వాగ్దానాన్ని గూర్చి యోసేపు నిశ్చయంగా విన్నాడు. బహుశా అతడా కథనాన్ని పలుమార్లు వినేయుంటాడు. దేవుడు తన కుటుంబము వారిని ఒక ప్రయోజనం కొరకు ప్రత్యేకించడంవలన అతని హృదయం పట్ట లేనంత సంతోషంతో నిండిపోయింది.

దేవుని హస్తంవలన తన జీవితం నడిపించబడుట యోసేపు గమనించాడు. అపజయాన్ని జయముగాను, నిరుత్సాహాన్ని ఉత్సాహంగాను, నిరాశను నిరీక్షణగాను దేవుని హస్తం అతని జీవితంలో కలుగజేసిన మార్పుల నతడు చూచాడు. అందువలన దేవుని వాగ్దానములు నెరవేరుతాయని అతడెరుగును.

"మరియు యోసేపు-దేవుడు నిశ్చయముగా మిమ్మును చూడ వచ్చును; అప్పుడు మీరు నా యెముకలను ఇక్కడ నుండి తీసికొని పోవలెనని చెప్పి ఇశ్రాయేలు కుమారులచేత ప్రమాణము చేయించు కొనెను" (ఆది 50:25).

ఇశ్రాయేలీయులు ఒకానొక దినమందు ఐగుప్తును విడిచి వెళ్ళెదరనే తనకున్న గొప్ప విశ్వాసానికి రుజువుగా, యోసేపు తన శల్యములను గూర్చి హెచ్చరిక నిచ్చాడు. అతడొక పరదేశములో విడిచిపో బడాలని కోరలేదుగాని తన పితరుల దేశములోనికి కొనిపోబడాలని కోరాడు (ఆది 50:5, 12, 13).

దేవుడు ఇశ్రాయేలీయులను దర్శించినట్లు మన మెరుగుదుము. "ఇశ్రాయేలీయులు యుద్ధసన్నద్ధులై ఐగుప్తులో నుండి వచ్చిరి. మరియు మోషే యోసేపు ఎముకలను తీసికొని వచ్చెను" (నిర్గమ 13:18, 19). తరువాత వాగ్దానము చేయబడిన దేశములో తన తండ్రి కొనిన చేని భాగములో యోసేపు ఎముకలు పాతిపెట్ట బడినట్లు యెహోషువ 24:32 లో మనము చదువగలము.

రాబోవువాటి విషయమై యోసేపుకు దేవునినుండి ఎట్టివాగ్దానములుండెనో, అంతకంటె అమూల్యములును అత్యధికములునైన వాగ్దానములు ప్రభువు మన కనుగ్రహించాడు (2 పేతురు 1:4). క్రైస్తవులకు నిత్యజీవము, నిత్యమైన స్వాస్థ్యము, జీవకిరీటము వాగ్దానము చేయుబడింది (హెబ్రీ 9:15; యాకోబు 1:12). అయితే దేవుని వాక్యానికి లోబడువారికే ఈ వాగ్దానములని మనము జ్ఞాపక ముంచుకోవాలి. సువార్త వాగ్దానములు మనం పొందునిమిత్తము దేవుని ఆజ్ఞలచొప్పున నడుచుకొనడానికి ప్రయత్నించెదము గాక. "ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసమువలన బలము నొందెదము గాక" (రోమా 4:21).

—డేవిడ్ జాన్సన్.

---

## క్రీస్తు జీవనము

క్రీస్తు జీవిత విశేషములను గూర్చి క్రొత్త నిబంధన యందలి నాలుగు సువార్తలయందు మనము చదువగలము. మత్తయి, మార్కు, లూకా, యోహానను ఈ నాలుగు సువార్త పుస్తకములు 89 అధ్యాయములుగ విభజింపబడినవి. మత్తయి తన సువార్త పుస్తకమునందలి 28 అధ్యాయములో 2 అధ్యాయములయందు క్రీస్తు జననవృత్తాంతమును వ్రాసెను. లూకా తన 24 అధ్యాయముల పుస్తకములో 2 అధ్యాయములను ఈవృత్తాంతము వ్రాయుటకు ఉపయోగించుకొనెను. ఆశ్చర్యమును కలిగించు విషయమేమనగ, మార్కు, యోహానను ఈ ఇరువురు లేఖకులు తమ పుస్తకములను క్రీస్తు బాప్తిస్మము పొందిన నాటినుండి తరువాత విషయములను మాత్రమే తెలియజేసిరి. వీరిరువురు క్రీస్తు జననమును గూర్చి ప్రస్తావించనే లేదు. దీనినిబట్టి 89 అధ్యాయముల చరిత్రలో 4 అధ్యాయములు మాత్రమే క్రీస్తు జననమును గూర్చి తెలియజేయు చున్నవి.

సువార్తలలో సుమారు సగంభాగము క్రీస్తు చివరి 7 రోజుల చరిత్రలో జరిగిన విషయములను వ్రాసిరి. క్రొత్త నిబంధన అంతటిలోను క్రీస్తు మరణము 175 కంటె ఎక్కువసార్లు ప్రస్తావించ బడెను. దీనినిబట్టి క్రొత్త నిబంధనలో క్రీస్తు జననముకంటె మరణమునకే ప్రాముఖ్యత ఇవ్వబడెను.

"సుగంధ తైలము కంటె మంచి పేరు మేలు. ఒకని జన్మదినము కంటె మరణదినమే మేలు" (ప్రసంగి 7:1). క్రీస్తు ప్రభువు మరణించుటద్వారా మానవులకు రక్షణభాగ్యము ననుగ్రహించెను. "ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). క్రీస్తు మానవుల కొరకు మరణించక పోయిన యెడల ఆయన జన్మించినను నిష్ప్రయోజనమే. క్రీస్తు తన జననముతో ప్రారంభించిన కార్యమును మరణముతో పూర్తి చేసెను. "కార్యారంభము కంటె కార్యాంతము మేలు" (ప్రసంగి 7:8). క్రీస్తు మరణమే మానవునికి అనేక ఈవులను అనుగ్రహించెనని లేఖనములు చెప్పుచున్నవి.

ప్రపంచ వ్యాప్తముగ 'క్రిస్మస్' అను పేరుతో అనేక వేడుకలు, విందులు జరుగుచూ ఉండడం మనం చూచుచున్నదే. క్రిస్మస్ కాలములో జరుగు వినోదపు వార్తలు, ప్రమాద వార్తలు మనం విను చూనే ఉన్నాము. 'క్రిస్మస్ పండుగ' అనుమాట ఆదిమ క్రైస్తవులు అసలు వినలేదు. ఇట్టిది ఒక ఆజ్ఞగా ఉన్నట్లు బైబిలులో ఎక్కడ చూడలేము. లేఖనములలో ఉన్న ఆజ్ఞలను విడిచిపెట్టి, లేని దానిని మానవులు కల్పించుకొనుట కేవలము వారి వినోదము కొరకే గాని దేవుని మహిమ పరచుటకు కాదు. "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక - ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" (లూకా 6:46). ఇది ప్రభువు ఆవేదన.

నా మరణమును జ్ఞాపకము చేసికొనుమని క్రీస్తు ఆజ్ఞాపించెను

"ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి ఒక రొట్టెను ఎత్తి కొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, దానిని విరిచి, యిది మీ కొరకైన నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను" (1 కొరింథీ 11:23, 24). ఆదిమ క్రైస్తవులు ఆదివారమున రొట్టె విరిచిరి (అపొ. కా. 20:7). ఆజ్ఞాపించిన దానిని విడిచిపెట్టి, ప్రభువు పేరుతో వినోదముకొరకు ఆశపడువారు క్రైస్తవులు కానేరరు. ప్రభు రాత్రిభోజనము ప్రతి ఆదివారమున చేయుట మాని, సంవత్సరమునకు రెండు లేక మూడుసార్లు మాత్రమే చేయుచు, ఆదివారము ప్రభు రాత్రిభోజనము ఆచరించు వారిని విమర్శించుచు, వినోదముకొరకు పాకులాడు వారు లేఖనములను ఎరుగనివారు.

మానవ కల్పిత సిద్ధాంతములను విడిచిపెట్టి బైబిలు నొద్దకు తిరిగిరండి. నూతన నిబంధన క్రైస్తవ్యమును అనుసరించి ప్రభువు వాగ్దానములను పొందండి.

—E. K. V. ప్రసాదరావు, చయ్యేరు.

---

## క్రిస్మస్ ఆంతర్యం

డిసెంబరు 25 న యేసుక్రీస్తు జనన మహోత్సవము జరుపు కొనుట వాడుక.

యేసుక్రీస్తు తను జీవించి ఉన్న కాలంలో అనగా 33½ సంవత్సరములలో ఎన్నడును పుట్టుకదినం జరుపుకున్నట్టు చూడలేము. ఆయన యొక్క శిష్యులుకూడ క్రీస్తు పుట్టుక దినంను చేసినట్టు చూడ లేదు. అది వారికి ఆజ్ఞాపించబడలేదు కూడ. క్రిస్మస్ పండుగనుగూర్చి పరిశుద్ధ గ్రంథములో ఏ ఒక్క వచనములోను మనకు కనిపించదు సరి కదా, ఆ పండుగను అలనాడు ఎవ్వరూ ఆచరించినట్టు కూడ చూడ లేము. పరిశుద్ధ గ్రంథములో ఒక దినమును క్రీస్తు పుట్టుక దినముగా

ఆచరించవలెనని ఎక్కడను బోధించుటలేదు సరికదా, ఆయన యొక్క పుట్టుక తేది నేటి వరకు ఎవరికిని తెలియకుండగనే యున్నది. దీన్ని గూర్చి అనగా యేసుక్రీస్తు పుట్టిన తేదీని గురించి బైబిలు చెప్పు లేదు. అలాంటప్పుడు క్రీస్తు జన్మదినం డిసెంబర్ 25 అంటూ ఏ ఆధారం లేకుండా ఆరోజున పండుగదినంగా ఆచరించుట విచారకరం. అసలు క్రిస్మస్ పండుగ అనేది ఎలా ఆచరణలోకినికి వచ్చినదో తెలుసుకుందాం.

క్రీస్తు పుట్టకమునుపు కూడా డిసెంబర్ 25 తేదీని పర్వదినంగా తమ్మూజ్ పుట్టుకదినంగా ఆచరించేవారు. అప్పుడది "టి"-మస్‌గా వ్యవహరించేవారు. ఆతరువాత నికేయ కౌన్సిలులో (క్రైస్ట్-మస్) క్రిస్మస్‌గా రూపొందించినట్టు చరిత్ర చెప్పుచున్నది. ఆదికాండం 10 అధ్యాయం చూచినట్టేయితే ఈ పండుగ ఎలా ఆచరణలోనికి వచ్చినదో తెలుసుకోగలం.

నిమ్రోదురాజు వేటలో మంచి నిపుణుడు. అందువలన అతడు దేవునిని కూడ లెక్క చెయ్యకుండా తానే సూర్య దేవుడనని గర్వంగా ప్రకటించుకున్నాడు. బాబెలు గోపురాన్ని నిర్మించిన ఈ నిమ్రోదు అవినీతికి దిగజారి చివరకు తన స్వంత తల్లినే వివాహమాడెనని చరిత్రలో వ్రాయబడి యున్నది. ఆమె పేరు సెమిరామిస్. అదే పేరుకు "అష్టారెట్" "ఆష్టోరెట్" అనే నామాంతరాలు కూడ వున్నాయి. ఈమె ఊహామాత్రమైన ఆకాశరాణి. జనులామెకు ధూప, నైవేద్యాలు చేసేవారు (యిర్మీయా 44:17). ఒక దినమున నిమ్రోదు వేటకు వెళ్ళినప్పుడు క్రూరమృగాలు అతనిని చీల్చి చంపివేసాయి. ఆ తరువాత సెమిరామిస్ ఆ నిమ్రోదే శిశువుగా తన గర్భములో ప్రవేశించాడని ప్రకటించింది. ఆ శిశువు పేరే తమ్మూజ్ (యెహెజ్కేలు 8:13-16). ఆ శిశువు పుట్టినప్పుడే అనగా డిసెంబర్ 24 న, నిత్యం పచ్చగా వుండే ఒక చెట్టు రాత్రికి రాత్రే మొలచినట్టుగా చూపించి, తమ్మూజ్

చెంతగా రకరకాల కానుకలు వుంచింది. నిమ్రోదే ఆ రూపంలో బ్రోయి, జెలియల్ సూర్యదేవర శరీరధారి అయినట్టు రూపకల్పన గావింపబడింది. దాని ప్రకారమే యూల్ అను సూర్యదేవుని పండుగ దినమును క్రీస్తు పుట్టుక దినముగా మార్చడంవల్లనే క్రిస్మస్ వచ్చియున్నది.

కాన్‌స్టాంటయిన్ అనే రోమా చక్రవర్తి ఒకసారి అతడు యుద్ధానికి వెళుతూ తను క్షేమంగా యుద్ధభూమి నుండి తిరిగి రాగలిగితే ఆ సమయానికి ఏ దేవుడైతే తనకు సాక్షాత్కరిస్తాడో ఆ దేవునిని అనుసరిస్తానని అనుకున్నాడు. అతడు యుద్ధభూమి నుండి క్షేమంగా తిరిగి వస్తుండగా ఆకాశ వీధిలో ఒక సిలువ గుర్తు అతనికి కనిపించిందట. అంతవరకు క్రైస్తవులను హింసించిన ఆ రోమా చక్రవర్తి క్రైస్తవ్యాన్ని స్వీకరించి, క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు పండుగగా ఆచరించరని, అన్యులు తమ్మూజ్ జన్మదినాన్ని డిసెంబరు 25 న ఆచరిస్తారని తెలుసుకుని ఆ తేదీని క్రీస్తు జన్మదినంగా ప్రకటించి, అప్పటి వరకు ఏ పండుగను చెయ్యని క్రైస్తవులను క్రీస్తు జన్మదినాన్ని చెయ్యమని వత్తిడి చెయ్యసాగాడు. ఈ విధంగా "క్రిస్మస్" పండుగ ఆచరణలోనికి వచ్చినట్టు చరిత్ర సాక్ష్యం చెప్పుచున్నది.

"ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:7-9) అని యేసుక్రీస్తు చెప్పిన మాటలు క్రిస్మస్ పండుగను ఆచరించే మతశాఖలవారికి గొడ్డలిపెట్టు. "అన్నపానముల విషయములోనైనను, పండుగ అమావాస్య విశ్రాంతి దినము అను వాటి విషయములోనైనను, మీకు తీర్పు తీర్చ నెవనికిని అవకాశ మియ్యకుడి" (కొలస్స 2:16). అంతేకాకుండ "మీరు దినములను, మాసములను, ఉత్సవ కాలములను, సంవత్సర కాలములను ఆచ

రించుచున్నారు. మీ విషయమై నేను పడిన కష్టము వ్యర్థమైపోవు నేమో అని మిమ్మునుగూర్చి భయపడుచున్నాను" (గలతీ 4:10-11). "మీ పండుగ దినములను నేను అసహ్యించుకొను చున్నాను, వాటిని నీచముగా ఎంచుచున్నాను" (ఆమోసు 5 : 12). "మీ పండుగ దినములను దుఃఖదినములుగాను, మీ పాటలను ప్రలా పములుగాను మార్చుదును" (ఆమోసు 8:10). "ఉత్సవ కాలములను పండుగలను, అమావాస్యలను, విశ్రాంతి దినములను, నియామిక కాలములను మాన్పింతును" (హోషేయ 2:11) అంటూ ప్రవక్తలద్వారా దేవుడు మాట్లాడియున్నాడు. దేవుడు ఆజ్ఞాపించిన వాటిని చెయ్యకుండా, ఆజ్ఞాపించని వాటిని చెయ్యడం మహాఘోరం. "ఆజ్ఞాతిక్రమమే పాపము" (1 యోహాను 3:4). దేవుడు చెప్పియున్న సంగతులను పాటించువాడే నిజ క్రైస్తవుడు. నిజ క్రైస్తవులకు సంవత్సరమునకు ఒక్కసారే పండుగదినం కాదుగాని ప్రతీవారం పండుగయే. అది ఏమనగా క్రీస్తుయొక్క మరణం, సమాధి, పునరుత్థానములను ప్రభు రాత్రి భోజనంద్వారా జ్ఞాపకం చేసుకొనుటయే. కావున క్రైస్తవులు దీనిని ప్రతీ ఆదివారం (అపొ 20:7) ఆచరించుటద్వారా దేవుని యొక్క చిత్తాన్ని నెరవేర్చిన వారగుదురు. అట్టివారికొరకు జీవకిరీటం దాచబడి యున్నది. నెరవేర్చనివారు అవిధేయులు. వారికొరకు ఆ మండుచున్న అగ్నిగుండం సిద్ధంగా యున్నది.

—ఇనుకపట్ల ఇశ్రాయేల్,
స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ

---

సత్యవాక్కు ప్రతినెల మూడు వేల మందికి పంపబడుచున్నది. కనీసం ఇంకో మూడువేల మంది దాన్ని చదువుచున్నారు. మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడు మేము వ్రాసే మీ అడ్రసు ప్రక్క నున్న నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం.

# యేసుక్రీస్తు వాక్యమని ఏల పిలువబడుచున్నాడు ?

*(Why is Jesus Christ called 'the word' ?)*

ఆదియందు వాక్యముండెను. యోహాను 1:1

లేఖనములలో యేసుక్రీస్తు అనేక నామములచే పిలువబడినట్లు చూడనగును. దేవుని కుమారుడు, మనుష్య కుమారుడు, గొర్రెపిల్ల, రక్షకుడు, మెస్సీయ, ఇమ్మానుయేలు, జీవాహారము, జీవజలము, ద్రాక్షవల్లి, గొఱ్ఱెలకాపరి. ఇవి ఆయన కివ్వబడిన నామములలో కొన్ని మాత్రమే. ఇంకను అనేక నామములుకలవు. యోహాను మాత్రమే ఆయనను వాక్యము (Word) అని పిలుచుచున్నాడు.

క్రీస్తును యూదా బెత్లెహేములో తన జననము నుండి మాత్రమే కాక ఆదినుండి అనగా నిత్యత్వము (Eternity) నుండి ఉన్నవాడనియు, సర్వసృష్టికి కారణభూతుడనియు ప్రకటించుటకే యోహాను తన సువార్తను వ్రాసినట్లు గ్రహింపనగును. యోహాను యూదుడు కాన పాతనిబంధనను ఎరిగినవాడు. తరువాత ప్రభువును వెంబడించి నూతన నిబంధనలోని కొన్ని గ్రంథములను లిఖించి, నూతన నిబంధన, పాత నిబంధన యొక్క నెరవేర్పుగా సూచించినాడు. దేవుడు తన నోటిమాటవలన విశ్వమంతటిని సృష్టించినాడనెడి సత్యమును పూర్తిగా విశ్వసించాడు.

పాత నిబంధనయందు ప్రభువు యొక్క వాక్యము (Word of the Lord) లేక యెహోవా వాక్కు అను పద సముదాయము తరుచుగా కానవగును. కింగ్ జేమ్సు ప్రతిలో "యెహోవా" అను శబ్దము "ప్రభువు" అని అనువదింపబడినది. దేవుడు వాగ్దాన దైవము (God of promise) అనియు, తన కృపను ప్రత్యక్షపరచుదైవము అనియు "ప్రభువు" అను పదము సూచించును. మెస్సీయ అను క్రీస్తునందు ఈ వాగ్దాన నెరవేర్పు సఫలమగునని కూడ పాత నిబంధన ఉద్ఘోషించు చున్నది. అందువలననే పాతనిబంధనలో ప్రభువు

వాక్యము (Word of the Lord) అనియు, నూతన నిబంధనలో దేవుని వాక్యము (Word of God) అనియు వ్రాయబడుట గమనార్హము. కాని మూడుచోట్ల మాత్రము పాత నిబంధనలో కూడ దేవుని వాక్యము అని వ్రాయబడినది. (న్యాయాధి 3 : 20; దినవృ 25:5; కీర్త 56:4). ప్రభువు వాక్యము అను పదము నూతన నిబంధనలో తొమ్మిది మారులు కానవచ్చును. (అపో.కా. 8:25; 13:44, 48 15:35, 36; 16:32; 19:10; 1 థెస్స 1:18; 2 థెస్స 3:1).

పాతనిబంధనలో ప్రభువు వాక్యము లేక వాక్కు (Word of the Lord) అనియు, క్రొత్తనిబంధనలో దేవుని వాక్యం (Word of God) అనియు తరుచుగా వాడబడుటకు కారణమేమి? పాత నిబంధనలో వాగ్దాన వాక్యమును, నూతన నిబంధనలో ఆ వాగ్దాన నెరవేర్పు వాక్యమును కలవు. ఈ వాక్యమే కృపావాక్యము; రక్షణ సందేశ వాక్యము; దేవుని వాక్యము (Word of God) అను పదము నూతన నిబంధనలో కనబడునప్పుడెల్ల అది సువార్తను (Gospel) అనగా యేసుక్రీస్తునందు లభించు రక్షణ సువార్తను మాత్రమే ప్రస్ఫుటముగా సూచించుననియు, ప్రభువైన యేసు యెహోవా యొక్క వాగ్దాన వాక్య నిజరూపమును బయలుపర్చుననియు గమనింపవలెను. పాతనిబంధన ప్రవచనములలో యేసుక్రీస్తు ప్రభువుయొక్క వాక్కు మన పూర్వీకులతో మాట్లాడిన వాక్కు. తరువాత ఈ వాక్కు దేవుని కుమారుడుగాను, మెస్సీయగాను బయలుపర్చబడినాడు.

Logos అను పదము, ప్రత్యేకముగా వాడబడినపుడు త్రైకము లోని రెండవ వ్యక్తినే సూచించును. ఈ అర్థములోనే యోహాను 1:1, 14 లో ఈ పదము వాడబడినది. Logos అను పదమునకు వాక్యము (word) అను అర్థము మాత్రమేకాక భాషణము (speech) అను భావముకూడ కలదు. Lalia అను గ్రీకు పదమునకు భాషణము అని అర్థము కలదు కాని lalia అను శబ్దము చిలుకపలుకులవలె

నుండు మాటలనే సూచించును. అనగా అవి అర్థరహితముగ నుండును. అర్థసహితముగను బౌద్ధికముగ నుండు భాషణమునకే logos వాడబడినది. కాబట్టి క్రీస్తు, దేవుని భాషణము (Christ is God's speech). అనగా దేవుడు మానవులతో మాట్లాడు భాషణము క్రీస్తే. ఈ భాషణము (logos) జ్ఞానవివేకముల పరిపూర్ణత కలదని యోహాను సూచించుచున్నాడు.

పై తలంపులను సమీకరించిన క్రీస్తే దేవుని భాషణమనియు, మాటయనియు, వాక్యమనియు విశదమగుచున్నది. ఆయన ద్వారానే దేవుడు మనతో మాట్లాడుచున్నాడు (హెబ్రీ 1:1).

దేవుని మాటవలన విశ్వమంతయు సృష్టింపబడెను. ఆ మాట క్రీస్తే కాన ఆయనే సర్వసృష్టికి ఆదిసంభూతుడు.

—టి. ప్రేమానందం, కాకినాడ.

---

మె నారి యనబడును—1

## స్త్రీ ప్రత్యేకంగా తయారు చేయబడింది

## *( Woman Especially Made )*

స్త్రీని గూర్చి రకరకాల భావాలు నేటి లోకంలో యున్నాయి. స్త్రీ అంటే వేతనంలేని బానిస యని, తన భర్త కోరికలకు లోబడేదని, తని అవుసరాలను తీర్చడానికి గంటలతరబడి పనిచేయునది యని ందరు భావిస్తూ యుంటారు. అది విచారకరం.

ఇంకో ప్రక్కనైతే 'ఆధునిక స్త్రీలు' మనకు కనబడతారు. ారు పురుషులతో సమానులమని చెప్పుకొంటూ పురుషుల ఉద్యోగా కు తలబడతారు. కొంతమందయితే పురుషుల కున్నాయని వారు లంచుచున్న లాభాలన్నీ వారికే కావాలంటారు. అదే సమయంలో ారు స్త్రీలు కాబట్టి వారి యెడల మృదువుగా ప్రవర్తించాలని కోరు

కుంటారు. అట్టివారు నిజానికి ఇరువైపుల యున్న లాభాలను కోల్పో
టారుగాని బాధ్యతలను కాదు.

ఈ రెండు రకాలైన భావములమధ్య (వాటిలో ఏదీ సరికాదు
దేవుడు సృష్టించిన స్త్రీ యున్నది. సత్యవాక్యంలో ఇప్పటి నుం
స్త్రీలకు వర్తించుకొన్న బైబిలు పాఠాలను నేర్చుకోడానికి ప్ర
త్నించెదము.

ఆదియందున్న దృశ్యాన్ని ఒకసారి పరికిద్దాం. దేవుడొక
పూర్ణ గృహాన్ని సిద్ధపరచాడు. అదొక పరదైసు. తన సృష్టికి కిరీట
అయిన మానవుని తన స్వరూపమందు ప్రేమతో పరిపూర్ణం
తయారు చేసాడు. అప్పుడతనిలోనికి ఆయన తన జీవవాయు
నూదగా, మొదటి మానవుడైన ఆదాము జీవించు చలించు యోచిం
వ్యక్తి అయ్యాడు.

ఈ పరిపూర్ణ దృశ్యంలో ఒక్కటి మాత్రమే కొరత
యున్నది. ప్రతి జీవరాసి జంటగా ఆడ, మగ యని సృజింప బడిం
"మీరు ఫలించి అభివృద్ధిపొంది సముద్ర జలములలో నిండి యుండు
పక్షులు భూమిమీద విస్తరించునుగాక...వాటి వాటి జాతి ప్రకార
జీవముగల వాటిని పశువులను పురుగులను అడవి జంతువులను భూ
పుట్టించునుగాక" యని దేవుడు పలికాడు (ఆది 1:22, 24). ఆదా
మాత్రమే ఏకాకిగా యున్నాడు. ఆదాము సమస్త పశువులకు, ఆక
పక్షులకు, భూజంతువులకు పేరులు పెట్టాడు. అయినను ఆదాము
సాటియైన సహాయము అతనికి లేకపోయెను (ఆది 2:20).

"అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢనిద్ర కలు
జేసి అతడు నిద్రించినప్పుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని
ఆ చోటును మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడై
యెహోవా తాను ఆదామునుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీని
నిర్మించి ఆమెను ఆదామునొద్దకు తీసికొని వచ్చెను. అప్పుడు ఆదా

ఇట్లనెను - నా యెముకలలో ఒక యెముక, నా మాంసములో మాంసము. ఇది నరునిలోనుండి తీయబడెను గనుక నారి యనబడును. కాబట్టి పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారు ఏకశరీరమై యుందురు" (ఆది 2:21-24).

### ఈ వచనములనుండి మనం ఏమి నేర్చుకోగలము !

1) ఒంటరిగా యుంటే మానవుడు సంపూర్ణుడు కాదు. 2) స్త్రీని చేయుటలో మానవునికి సాటియైన సహాయం కల్పించడం దేవుని ఉద్దేశం. అతని కఠినత్వాన్ని మృదువు చేసేదిగాను, అతని బలహీనతలలో బలపరచేదిగాను ఆమె చేయబడింది. వీరిద్దరు ఏకమైనప్పుడు వారికి కొదువైనది యేమీ వుండదు. 3) స్త్రీ వేరొక మంటి ముద్దలోనుండి గాక మానవుని నుండి చేయబడింది. గనుక ఆమె, అతడు కలసి వారిద్దరియొక్క ఏకత్వమును పంచుకొనేలాగున దేవుడు ఆమెను చేసాడు. 4) స్త్రీ పురుషులు పెండ్లాడినప్పుడు వారు ఒండొరులకు ప్రతిష్ఠించుకోవాలి.

గనక జీవించుచున్న వారందరికి తల్లియైన హవ్వ ఆదాము కొరకు ప్రత్యేకంగా చేయబడింది. చరిత్ర యంతటిలోను మంచి భార్య, ఒక భర్తకు గృహానికి దేవుడిచ్చిన గొప్ప బహుమానమై యున్నది.

—బెట్టీ ఛోట్.

---

## శుభ వార్త !

## ( *Good News !* )

ఆధునిక సమాచార ప్రసార సాధనాల మూలంగా వార్తలు సేకరించడం ఒక పెద్ద వ్యాపారం అయిపోయింది. వార్తలుగా అందింపబడే వాటిలో ఎక్కువ దుర్వార్తలే. ప్రజలు చేసే మంచికంటే చెడుగే మనకు ఎక్కువ వినబడతాది, కనబడతాది.

ఈ ప్రపంచములో యున్నవారిలో సగంమంది పాపము నుండి రక్షణ దేవుని కుమారుడైన క్రీస్తులో యున్నదనే మంచి వార్తను వినియుండలేదని చెప్పబడింది. అనేక సంవత్సరాలుగా సువార్త ప్రకటింపబడుచున్నది గనుక, ఇక అది ప్రకటింపబడ నవసరం లేదని అనుకొనడం సులభమే. కాని రక్షణను గూర్చిన మంచి వర్తమానాన్ని మనం బోధించుచూ యుండడం అత్యవసరం.

క్రీస్తులో యున్న రక్షణను పొందాలంటే ఒకడు తన సంపూర్ణ విశ్వాసాన్ని క్రీస్తునం దుంచాలి. తన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి, యేసు దేవుని కుమారుడనే తన విశ్వాసాన్ని ఒప్పుకోవాలి, పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తులోనికి బాప్తిస్మము పొందాలి (మార్కు 16:16; అపొ.కా. 2:38; 8:36-39). క్రీస్తు సువార్తకు అట్లు లోబడుట ద్వారా ఒకడు క్రైస్తవుడౌతాడు. ప్రభువుచే అతడు ఆయన సంఘములో చేర్చబడతాడు, ఆయన కుటుంబ సభ్యుడౌతాడు (అపొ.కా. 2:41-47; 1 తిమో 3:15, 16).

---

Regd. No. 11/KD—45/KD. H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

To

..............................

..............................

..............................

..............................